



# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190





ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :169 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ ఆదివారం- 19 - జూలై- 2026

## ఇదేనా మీ సుపరిపాలన? ఇదేనా మీ పోలీసింగ్?



తాడేపల్లి: గుంటూరు నగరంలో ఒక మహిళను వివస్త్రను చేసిన ఘటనపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుడు దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ మాత్రమే కాదని, రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణ ఎంత ఘోరంగా విఫలమైందో చెప్పడానికి నిలువెత్తు నిదర్శనమని చెప్పారు. ఈ దారుణానికి చంద్రబాబు ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని అన్నారు. “బుధవారం ఘటన జరిగితే.. మూడు రోజులపాటు దాన్ని కప్పిపెట్టినా, చివరకు ఆ వీడియోలు సోషల్ మీడియాలో బయటకు వచ్చి, రాష్ట్ర ప్రజలంతా చూసి ఈ పరిపాలనను అసహ్యించుకున్న తర్వాత, ఇప్పుడు తానేదో గొప్పగా చర్యలు తీసుకుంటున్నట్లు చంద్రబాబు హడావుడి చేయడం మరింత సిగ్గుచేటు. ఆ వీడియోలు కప్పిపుచ్చేదానిపై మిగతా..2లో

## శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు!



తిరుమల కొండపై భక్తజన సంద్రం

కిలోమీటర్ల మేర క్యూలైన్లు

నిండిపోయిన కంపార్ట్‌మెంట్లు, శిలాతోరణం దాటిన క్యూలైన్లు

శుక్రవారం రూ. 3.66 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం

తిరుపతి : తిరుమల క్షేత్రంలో భక్తుల రద్దీ భారీగా కొనసాగుతోంది. వారాంతం కావడంతో శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ పూర్తిగా నిండిపోయి, క్యూలైన్లు బయట శిలాతోరణం వరకు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనం కోసం సుమారు 24 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం మిగతా..2లో

## టీ-హబ్ బేబీ 'స్కైరూట్' చరిత్ర సృష్టించింది



- శ్రీహరికోట నుంచి రాకెట్ ను విజయవంతంగా ప్రయోగించిన స్కైరూట్
- టీహబ్ నుంచే స్కైరూట్ పురుడు పోసుకుందన్న కేటీఆర్
- ఆ సంస్థ ఇప్పుడు గ్లోబల్ స్థాయికి ఎదగడం అందరికి స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య

హైదరాబాద్: హైదరాబాద్ సరూర్ నగర్ వేదికగా జరిగిన ‘యువ సంగ్రామ సదస్సు‘లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇవాళ నమోదైన కీలక అంతరిక్ష విజయాన్ని పంచుకున్నారు. దేశంలోనే తొలిసారిగా శ్రీహరికోట నుంచి ప్రైవేట్ రాకెట్ ‘విక్రమ్-1‘ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ అద్భుత రికార్డు సృష్టించిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ మరెక్కడో కాదు..

## తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలపై
# ఉక్కుపాదం..

కఠిన చట్టానికి సీఎం రేవంత్ గ్రీన్ సిగ్నల్

- తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైంది.
- ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే లక్ష్యంతో కఠిన చట్టాన్ని తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేయగా, కల్తీదారులపై కఠిన చర్యలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది.




హైదరాబాద్, జులై 18: తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కల్తీ సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మిగతా..2లో

## రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం
## కోమటిరెడ్డి వెంకటరెడ్డి



- ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందిస్తామన్న కోమటిరెడ్డి
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని వ్యాఖ్య
- పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్న మంత్రి

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో గుడిసెలు అనేవే లేకుండా చేస్తామని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత పక్కా ఇల్లు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మిగతా..2లో

## ఈసారి రెండో హెచ్-1బీ లాటరీ లేదు

- హెచ్-1బీ వీసా లాటరీకి సంబంధించి యూఎస్ పౌరసత్వ, వలస సేవల శాఖ (యూఎస్‌సీఐఎస్) తాజాగా కీలక ప్రకటన చేసింది.
- 2027 ఆర్థిక సంవత్సరానికి గాను రెండో లాటరీ ఉండదని పేర్కొంది.




ఇంటర్నెట్ డెస్క్: హెచ్-1బీ వీసా లాటరీకి సంబంధించి యూఎస్ పౌరసత్వ, వలస సేవల శాఖ (యూఎస్‌సీఐఎస్) తాజాగా కీలక ప్రకటన చేసింది. 2027 ఆర్థిక సంవత్సరానికి గాను రెండో లాటరీ ఉండదని పేర్కొంది. ఈసారి కోటాకు సరిపడా హెచ్-1బీ పిటిషన్లు ఇప్పటికే అందాయని తెలిపింది. ప్రతి సంవత్సరం 65 వేల సాధారణ హెచ్ -1బీ వీసాలతో పాటు అడ్వాన్స్‌డ్ డిగ్రీ మినహాయింపు కింద మరో 20 వేల హెచ్-1బీ వీసాలు జారీ అవుతున్న విషయం తెలిసిందే. ఈ కోటాకు సరిపడా పిటిషన్లు అందాయని యూఎస్‌సీఐఎస్ తాజాగా పేర్కొంది. ఈ సంవత్సరం తొలిసారిగా వేతన ఆధారిత విధానంలో లాటరీ నిర్వహించారు. అంతేకాకుండా, గతంతో పోలిస్తే ఈసారి వీసా రిజిస్ట్రేషన్లు కూడా తగ్గాయి. 2026 ఆర్థిక సంవత్సరంలో 343,981 హెచ్-1బీ రిజిస్ట్రేషన్లు రాగా 2027 ఆర్థిక సంవత్సరానికి 211,600 రిజిస్ట్రేషన్లు వచ్చాయి. దీంతో, ఈసారి అదనపు లాటరీల అవసరం ఉండవచ్చన్న అంచనాలు వెలువడ్డాయి. అయితే, అంచనాలకు భిన్నంగా రెండో లాటరీ ఉండదని యూఎస్‌సీఐఎస్ పేర్కొంది. ప్రతి సంవత్సరం హెచ్-1బీ కోసం అప్లై చేసుకున్న సంస్థల రిజిస్ట్రేషన్ల నుంచి కోటాకు సరిపడా కొన్నింటిని లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. లాటరీలో తమ రిజిస్ట్రేషన్లు ఎంపికయ్యాక ఆయా సంస్థలు ఫీజుతో కూడిన పిటిషన్లను సమర్పిస్తాయి.

## విజయవాడ నుంచి కనెక్టివిటీ పెంచేందుకు ప్రయత్నాలు
### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



- గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన నియంత్రణ సేవల భవనం ప్రారంభం
- ప్రారంభోత్సవానికి హాజరైన కేంద్రమంత్రి రామ్మోహన్, ఎంపీలు కేశినేని చిన్ని, బాలశౌరి
- ఏటీసీ భవనం ముందు మొక్క నాటిన రామ్మోహన్, చిన్ని

## అసత్యం, హింసలే మోదీ ప్రభుత్వానికి
# మూల సిద్ధాంతాలు“

- సోనమ్ వాంగ్‌చుక్‌ను జంతర్ మంతర్ నుంచి తరలించడాన్ని తప్పుబట్టిన రాహుల్ గాంధీ
- విద్యా ఖర్చులు, పేపర్ లీకులు, విద్యార్థుల ఆత్మహత్యలే కీలక సమస్యలని వ్యాఖ్యలు



ఢిల్లీ : లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ- శనివారం కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 20 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న విద్యా సంస్కరణల ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను జంతర్ మంతర్ నిరసన స్థలం నుంచి ఢిల్లీ పోలీసులు సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ మేరకు ఎక్స్‌లో (ట్విట్టర్) స్పందించిన రాహుల్ గాంధీ ‘అసత్యం, హింసే మోదీ ప్రభుత్వ మూల సిద్ధాంతాలు. అహింసా మార్గంలో నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను జంతర్ మంతర్ నుంచి తరలించడం తప్పు.‘ అని పోస్ట్ చేశారు. దేశ భవిష్యత్తుకు పేపర్ లీకులు, పెరుగుతున్న విద్యా ఖర్చులు, విద్యార్థుల ఆత్మహత్యలు అత్యంత కీలకమైన సమస్యలని రాహుల్ పేర్కొన్నారు. ప్రభుత్వం పోలీస్ బలగాల్ని ఎంతలా ఉపయోగించినప్పటికీ ఈ అంశాలపై స్వరం వినిపిస్తున్న విద్యార్థులను, వారికి మద్దతుగా నిలిచే తమ లాంటి వారిని అడ్డుకోలేరని అన్నారు. జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా మిగతా..2లో

## గోదావరిలో గల్లంతైన ఐదుగురూ మృతి..
## చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి



- పోలవరం జిల్లా ఎటపాక మండలంలో విషాదకర ఘటన
- గోదావరి నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన గిరిజనులు
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న చంద్రబాబు
- ఈ ఉదంతం కలచివేసిందన్న పవన్

అమరావతి: పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు స్థానికులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం

## భారత్ మరిన్ని విజయాలతో ఉన్నత శిఖరాలను
# అధిరోహించాలి

విక్రమ్-1 రాకెట్ తొలి ప్రయోగంలోనే విజయం సాధించడంపై సీఎం చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్‌లకు ఎక్స్ వేదికగా అభినందనలు తెలియజేశారు.




అమరావతి, జులై 18: ‘విక్రమ్-1’ రాకెట్ తొలి ప్రయోగంలోనే విజయం సాధించడంపై సీఎం చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్‌లకు ఎక్స్ వేదికగా అభినందనలు తెలియజేశారు. విక్రమ్-1 తొలి ప్రయోగంలోనే విజయవంతంగా కక్ష్యలోకి చేరడంతో భారత్ మరో చారిత్రక మైలురాయిని అధిగమించిందన్నారు. ప్రపంచంలోని అత్యుత్తమ దేశాలతో పోటీపడే స్థాయికి భారత ప్రైవేటు అంతరిక్ష రంగం ఎదిగిందని ఈ విజయం నిరూపించిందని

## హైదరాబాదులో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన నారా లోకేశ్..



- గతంలో పవన్ భుజానికి గాయం
- ఇటీవల ముంబైలో విజయవంతంగా శస్త్రచికిత్స
- కొన్ని రోజుల కిందటే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి
- హైదరాబాదులోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న వైనం
- పవనన్న త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన లోకేశ్

## మొదటి పేజి తరువాయి

# భారత్ మరిన్ని విజయాలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

వెల్లడించారు. ఇది భారత అంతరిక్ష రంగంలో ఒక నూతన యుగానికి నాంది అని పేర్కొన్నారు. శాస్త్రీయ సంస్థల సామర్థ్యం, భారతీయ పారిశ్రామికవేత్తల సృజనాత్మకత కలిసినప్పుడు ఆవిష్కరణలకు కొత్త హద్దులు ఏర్పడతాయని ఈ ఘన విజయం చాటిచెప్పిందని సీఎం తెలిపారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్ సహా ఈ విజయాన్ని సాకారం చేసిన వేలాదిమంది శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, భాగస్వామ్యులందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ విజయం ప్రతి భారతీయుడు గర్వపడే క్షణమన్నారు. భావితరాల యువ శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలకు గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. నక్షత్రాల వైపుగా భారత్ సాగిస్తున్న ప్రస్థానం మరిన్ని విజయాలతో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

# హైదరాబాదులో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన నారా లోకేశ్..

అమరావతి : ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శనివారం పరామర్శించారు. ఇటీవల ముంబయిలో భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కల్యాణ్‌ను లోకేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా "పవనన్న త్వరగా కోలుకోవాలి" అని ఆయన ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని లోకేశ్ అడిగి తెలుసుకున్నారు. భుజానికి అయిన గాయం, జరిగిన శస్త్రచికిత్స వివరాలను అడిగారు. వైద్యుల సూచనల మేరకు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. తన పరామర్శ అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. "డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారిని పరామర్శించాను. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించాను. వైద్యుల సూచనలు పాటిస్తూ వీలైనంత మేర విశ్రాంతి తీసుకోవాలని సూచించాను" అని తెలిపారు. గతంలో భుజానికి గాయం కావడంతో పవన్ కల్యాణ్ కొంతకాలంగా ఇబ్బంది పడుతున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో ఆయన కుడి భుజానికి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత ఆయన హైదరాబాద్‌లోనే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు. పలువురు ప్రముఖులు ఆయన నివాసానికి వచ్చి పరామర్శిస్తున్నారు.

# తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలపై ఉక్కుపాదం..

అలాగే అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్ బ్లోయర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ చట్టంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం బిల్లుకు తుది రూపం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. కల్తీల నియంత్రణలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో అమలవుతున్న చట్టాలు, విధానాలను అధ్యయనం చేసి వాటిలో ఉత్తమ పద్ధతులను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో 'క్యూర్' ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ వ్యవస్థను అమలు చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపింది. సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. రసాయన అవశేషాలు, కల్తీ కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, కల్తీలకు పాల్పడే వారిపై ఇకపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది.

# రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం: కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని ఆయన కొనియాడారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో రూ.184.15 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పరిగి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు కీలక వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని పేద ప్రజలు సొంతంగా పక్కా ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని కోమటిరెడ్డి తెలిపారు. త్వరలోనే అర్హులైన మిగతా వారందరికీ ఇళ్లు ఇచ్చేందుకు రెండో విడత కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. వికారాబాద్ జిల్లాలో రోడ్ల నెట్‌వర్క్ బలోపేతం కోసం రూ.900 కోట్ల నిధులు మంజూరు చేయించామని, అందులో నుంచే పరిగి నియోజకవర్గానికి రూ.184.15 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రవాణా వ్యవస్థ మెరుగైతేనే పరిశ్రమలు వచ్చి స్థానిక యువతకు ఉపాధి పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి తీరుతామని మాట ఇచ్చిన మంత్రి కోమటిరెడ్డి... నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులతో పాటు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నామని వివరించారు.

# టీ-హబ్ బేబీ 'స్కైరూట్' చరిత్ర సృష్టించింది: కేటీఆర్

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'టీ-హబ్' వేదికగానే పురుడు పోసుకుందని గర్వంగా ప్రకటించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు పూర్తయిన తరుణంలో... దేశ చరిత్రలోనే సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ ఒక ప్రైవేట్ రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపిన ఘనత స్కైరూట్ కంపెనీకే దక్కుతుందని కేటీఆర్ కొనియాడారు. మన హైదరాబాద్‌లోని టీ-హబ్ వేదికగా స్టార్టప్‌గా ప్రస్థానం మొదలుపెట్టిన ఒక సంస్థ, ఇవాళ ప్రపంచ స్థాయిలో దేశం గర్వించేలా ఎదగడం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. శ్రీహరికోట సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ప్రయోగం అత్యంత విజయవంతంగా ముగిసిందని కేటీఆర్ తెలిపారు. ఈ చరిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించిన స్కైరూట్ టీమ్‌కు సభకు హాజరైన నిరుద్యోగ యువత, విద్యార్థులంతా చప్పట్లతో ఘనంగా అభినందనలు తెలపాలని అన్నారు. మరోవైపు, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో సహకారంతో ప్రైవేట్ రంగానికి చెందిన తొలి దేశీయ రాకెట్ ప్రయోగం సక్సెస్ కావడంతో... అటు ఇస్రో సైంటిస్టులతో పాటు ఇటు స్కైరూట్ కంట్రోల్ సెంటర్‌లోనూ పండుగ వాతావరణం నెలకొంది.

# శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు!

(టీటీడీ) అధికారులు తెలిపారు. ఈ రద్దీ కారణంగా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్న భక్తులకు కూడా దర్శనానికి 3 నుంచి 6 గంటల సమయం పడుతోంది. టీటీడీ వెల్లడించిన వివరాల ప్రకారం, శుక్రవారం (జులై 17) ఒక్కరోజే 74,096 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 36,562 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.66 కోట్లుగా నమోదైంది. భక్తుల కోసం 4 లక్షల లడ్డూలను విక్రయించగా, 2.98 లక్షల మందికి అన్నప్రసాదం అందించారు. సుమారు 3,890 మందికి వైద్య సేవలు అవసరమయ్యాయి. భారీ రద్దీ దృష్ట్యా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్న భక్తులకు పాలు, తాగునీరు, అన్నప్రసాదాలను నిరంతరాయంగా పంపిణీ చేస్తోంది. భక్తులు ఓపికతో వ్యవహరించి, సిబ్బందికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నేరస్థుల చేతిలో సాంకేతిక ఆయుధం

ఇప్పటికే అనేక ఆందోళనలకు కారణమవుతున్న కృత్రిమ మేధ(ఏఐ)పై ఇప్పుడు కొత్త చర్చ మొదలైంది. తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులు ఏఐ ప్లాట్‌ఫామ్స్‌పై వ్యూహరచన చేస్తుండటం కలవరపాటుకు గురిచేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటివి అనేక ఘటనలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో నేరగాళ్ల చేతిలో ఏఐ ఒక ఆయుధంగా మారకుండా ప్రభుత్వాలు, ఆయా సంస్థలు జాగ్రత్తపడాలి. నిరుడు జరిగిన ఓ ఘటనలో చాట్‌జీపీటీ ప్రమేయం ఆలస్యంగా వెలుగు చూసింది. అమెరికాలోని ఫ్లోరిడా స్టేట్ యూనివర్సిటీ విద్యార్థి ఫీనిక్స్ ఇక్నర్ తాను సంచలనంగా మారాలంటే ఎంతమంది సహచర విద్యార్థులను చంపాలనేది తెలుసుకోవాలనుకున్నాడు. చాట్‌జీపీటీని అడగగా 'సాధారణంగా 3 లేదా అంతకంటే ఎక్కువ మంది చనిపోతే, మొత్తం బాధితుల సంఖ్య అయిదు నుంచి ఆరుగురి వరకు ఉంటే ఆ వార్త జాతీయ మీడియాలో వస్తుంది' అని సమాధానం చెప్పింది. అంతకుముందు అతను తాను ఎంత నిరాశాపూరితంగా, ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలతో ఉన్నాడో ఆ చాట్‌బాట్‌కు వివరించాడు. ఆ తర్వాత ఇక్నర్ ఒక హ్యాండ్‌గన్, మందుగుండు సామగ్రి చిత్రాన్ని అప్‌లోడ్ చేసి దాన్ని ఎలా ఉపయోగించాలో చాట్‌బాట్‌ని అడిగాడు. ఆ తర్వాత ఫ్లోరిడా స్టేట్ యూనివర్సిటీలో ఇద్దరిని చంపి, ఆరుగురిని గాయపరిచాడు. ఈ దారుణంలో చాట్‌జీపీటీ పాత్రపై తమ కార్యాలయం దర్యాప్తు ప్రారంభించిందని ఫ్లోరిడా అటార్నీ జనరల్ ఉత్మీయర్ పేర్కొన్నారు.

పట్టించుకోని కంపెనీలు

కెనడాలోని బ్రిటిష్ కొలంబియా టంబ్లర్ రిడ్జ్ పట్టణంలో మొన్న ఫిబ్రవరిలో ఘోరమైన కాల్పుల ఘటన చోటుచేసుకుంది. 18 ఏళ్ల జెస్సీ వాన్ రూట్‌సెలార్ అనే ట్రాన్స్‌జెండర్ తన ఇంట్లో తల్లిని, సవతి సోదరుడిని కాల్చి చంపింది. ఆ తర్వాత తాను గతంలో చదివిన టంబ్లర్ రిడ్జ్ స్కూల్‌కు వెళ్లింది. అక్కడ తను జరిపిన కాల్పుల్లో ఆరుగురు మృతిచెందగా మరో 27 మంది గాయపడ్డారు. తర్వాత తనను తాను కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దానికి కొన్ని నెలల ముందు జెస్సీ చాట్‌జీపీటీతో తుపాకీ హింస, సామూహిక కాల్పులు, హత్య దృశ్యాలు వంటి అంశాలపై సంభాషించింది. ఆ సంభాషణలను ఓపెన్ ఏఐ ఆటోమేటెడ్ రివ్యూ వ్యవస్థ ఫ్లాగ్ చేసింది. దాన్ని సమీక్షించిన కొందరు ఉద్యోగులు ఆమె కాల్పులు, హింసకు పాల్పడే అవకాశం ఉందని, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కంపెనీ యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వలేదు. ఆమె ఖాతాను మాత్రం నిలిపివేసింది. జెస్సీ మరో ఈ-మెయిల్‌తో కొత్త ఖాతా తెరిచి చాట్‌జీపీటీని వినియోగించింది. హింసాత్మక విషయాలపై జరిగిన సంభాషణను గుర్తించాక కూడా అధికారులను అప్రమత్తం చేయటంలో ఓపెన్‌ఏఐ కంపెనీ విఫలమైందని పెద్దయెత్తున విమర్శలు వచ్చాయి. అమెరికాలోని చాలామంది పాఠశాల స్థాయి విద్యార్థులు హింసకు పాల్పడటంపై ఏఐ వేదికలను సంప్రదిస్తున్నారు. ఓ విద్యార్థి తన పాఠశాల, దాని మార్గాలతోపాటు తుపాకీతో ఉన్న తన ఫొటోలను అప్‌లోడ్ చేసి ఉపాధ్యాయులు, విద్యార్థులను కాల్చి చంపినట్లు చూపించాలని కోరితే చాట్‌జీపీటీ అలాగే చేయడం ఆందోళనకు గురిచేస్తోంది. ఉగ్రవాదులు, సైబర్ నేరగాళ్లు సైతం ఏఐని విస్తృతంగా వాడుతున్నారు. నిరుడు దిల్లీ ఎర్రకోట సమీపంలో వాహనంలో అమర్చిన పేలుడు పదార్థం ద్వారా చేసిన ఉగ్రదాడిలో ప్రధాన నిందితుడు జసీర్ బిలాల్‌వాని ఏఐ, సామాజిక మాధ్యమాలు, ఇతర డిజిటల్ వనరులను ఉపయోగించి రాకెట్ ఆధారిత ఐఈడీలు,

# గోదావరిలో గల్లంతైన ఐదుగురూ మృతి.. చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి

## మొదటి పేజి తరువాయి

చేశారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు ఇలా మృత్యువాత పడటం అత్యంత విచారకరమని, బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే చంద్రబాబు అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన తుర్రం భారతి, ఊకే సుశీల, ఊకే లక్ష్మి, బాసిబోయిన బాలరాజు, ఊకే రమేశ్ అనే ఐదుగురు ఈ దుర్ఘటనలో మరణించినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. బాధిత కుటుంబాలకు తక్షణమే అవసరమైన ఆర్థిక, నిత్యావసర సహాయ సహకారాలు అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి



ఆదేశించారు. ఈ దారుణ ఉదంతం తనను తీవ్రంగా కలిచివేసిందనిపవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన పోలవరం జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి, ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు.

ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ.. ప్రభుత్వం తరపున వారికి ఎలాంటి లోటు రాకుండా సహాయ చర్యలు ముమ్మరం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఆమె ఫోన్‌లో మాట్లాడి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సాధారణంగా చేపల వేటకు వెళ్లే ప్రాంతంలో ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో సమగ్ర దర్యాప్తు జరపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు తక్షణ ప్రభుత్వ సాయం అందేలా చూడాలని జిల్లా యంత్రాంగానికి స్పష్టం చేస్తూ... మృతుల కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆమె ఆకాంక్షించారు.

# ఇదేనా మీ సుపరిపాలన? ఇదేనా మీ పోలీసింగ్?

## మొదటి పేజి తరువాయి

శ్రద్ధచూపే బదులు, బుధవారమే తనపై తొలిసారే దాడి జరిగిన తర్వాత, బాధిత మహిళ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినప్పుడు వారు స్పందించి ఉండి ఉంటేగనక, ఆ తర్వాత ఇంతటి ఘోరం జరిగి ఉండేది కాదుకదా? ఆమె ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని ఉంటే ఈ దారుణం జరిగేదా? ఫిర్యాదు చేసిన మహిళకు రక్షణ కల్పించకుండా మౌనం వహించడం ఎంతవరకు న్యాయం? ఇక పోలీస్‌స్టేషన్లు ఉన్నది ఎందుకు? బాధితుల ఫిర్యాదులను స్వీకరించడానికా? లేక అధికార పార్టీ నాయకులు ఏంచెప్తే అది చేయడానికా? బాధితురాలికి అండగా నిలవకపోగా, పంచాయితీ చేయడానికి ప్రయత్నిస్తారా? వీడియోలు బయటకు వస్తేనే చట్టం మేల్కొంటుందా? బాధితురాలి మాటకు, ఆమె ఫిర్యాదుకు విలువ లేదా? నేరం జరుగుతున్నప్పుడు స్పందించకుండా, ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికిన తర్వాత చర్యల పేరుతో నాటకాలు ఆడడం ఏ రకమైన పోలీసింగ్?" అని వైఎస్ జగన్ నిలదీశారు.

### రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో దారుణాలు

రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఈ చంద్రబాబు ప్రభుత్వం దగ్గరుండి దాడులను ప్రోత్సహించిందని వైఎస్ జగన్ చెప్పారు. "ఆ అరాచకాలను కప్పిపుచ్చడానికి పోలీసు వ్యవస్థను రాజకీయ ఆయుధంగా మార్చింది. చట్టాన్ని అధికార పార్టీకి చుట్టంగా, ప్రతిపక్షాలపైనా, బాధితులపైనా వేధింపులకు, అక్రమ కేసులకు ఒక సాధనంగా మార్చి రాష్ట్రాన్ని జంగిల్‌రాజ్‌గా దిగజార్చింది. అధికార పార్టీ నాయకులు ఏం చేసినా ఈ పోలీసులు తమను రక్షిస్తారనే ధైర్యం ఈ రెడ్‌బుక్‌పాలనలో గ్రామాలు, వార్డులు, డివిజన్ల స్థాయి వరకూ పాకింది. అందుకే టీడీపీ కూటమికి చెందిన పలువురు నాయకులు దుశ్శాసనుల్లా తయారయ్యారు. ఎలాంటి దారుణాలుచేసినా, ముఖ్యంగా మహిళలపై దాడి చేసినా, వారిని అవమానించినా, వేధించినా తమకు ఏమీ కాదని, తమను కాపాడ్డానికి చంద్రబాబుగారు ఉన్నారనే ధైర్యం, వారిలో



పెరిగిపోయింది. ఇది చివరకు రాష్ట్రంలో ఆడవాళ్లకు రక్షణ లేకుండా చేసింది. అధికార పార్టీ నాయకుల దురాగతాల నుంచి తమను తాము కాపాడుకోవాల్సిన దుస్థితిలోకి మహిళలను నెట్టేసింది. చంద్రబాబుగారూడ ఇదేనా మీరు చెప్పే మహిళా భద్రత? ఇదేనా మీ సుపరిపాలన? ఇదేనా మీ పోలీసింగ్? చంద్రబాబూ.. మహిళల ఆగ్రహమే మీ ప్రభుత్వానికి తగిన బుద్ధిచెప్తుంది" అని అన్నారు.

# అసత్యం, హింసలే మోదీ ప్రభుత్వానికి మూల సిద్ధాంతాలు"

## మొదటి పేజి తరువాయి



నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను శనివారం ఉదయం దిల్లీ పోలీసులు బలవంతంగా ఆస్పత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తుండటంతో వైద్యుల సలహా మేరకు పోలీసులు ఈ చర్య తీసుకున్నారు. ఈ క్రమంలోనే పోలీసుల చర్యపై రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యను ఎండగడుతూ కాంగ్రెస్ నేత సోషల్ మీడియా వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా కేంద్రంపై తీవ్ర విమర్శలు చేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాల్సింది పోయి, సోనమ్ వాంగ్‌చుక్‌ను నిరసన స్థలం నుంచి తొలగించారని మండిపడ్డారు. ప్రజల ఒత్తిడి పెరుగుతుండటంతో శాంతియుత నిరసనను ఫాసిస్ట్ ధోరణిలో అణిచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. జులై 20న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానుండగా అంతకంటే ముందుగానే ధర్మేంద్ర ప్రధాన్‌ను కేంద్ర మంత్రి వర్గం నుంచి తొలగించాలని కాంగ్రెస్ మరోసారి డిమాండ్ చేసింది.

### వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించిందని చెప్పిన డాక్టర్లు

శనివారం ఉదయం 7.40 గంటలకు సోనమ్ వాంగ్‌చుక్‌ను సఫ్దర్ జంగ్ ఆస్పత్రిలోని ఎవీవీజ విభాగానికి తరలించారు దిల్లీ పోలీసులు. ఆస్పత్రి వర్గాల సమాచారం ప్రకారం 20 రోజుల పాటు నిరాహార దీక్ష చేసినందుకు ఆయన శరీరంలో డీహైడ్రేషన్ (నీటి శాతం తగ్గడం) సహా పొటాషియం స్థాయిలు పడిపోవడం, కీటోన్ స్థాయిలు భారీగా పెరగడం వంటి సమస్యలు తలెత్తాయి. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందని, ఇతర శారీరక సమస్యలు కూడా వస్తాయవి వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఐవీ ఫ్లూయిడ్స్ (సెలైన్ ఎక్కించడం) ద్వారా చికిత్స అందించాలని వైద్యులు సూచించినప్పటికీ, వాంగ్‌చుక్ మెడిసిన్, ఇతర ద్రవ పదార్థాలు గానీ తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. మరోవైపు తన అనుమతి తీసుకోకుండా తన భర్తకు ఎలాంటి ట్రీట్మెంట్ చేయొద్దని వాంగ్‌చుక్ భార్య గీతాంజలి స్పష్టం చేశారు. ఆయనకు ఏదైనా జరిగితే ప్రతి ఒక్కరూ కచ్చితంగా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. దీంతో ఆయన ప్రాణాల్ని కాపాడేందుకు చికిత్సకు సహకరించాల్సిందిగా వైద్యులు వాంగ్‌చుక్ కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

### యథావిధిగా పార్లమెంట్ మార్చ్- సీజేపీ కీలక ప్రకటన

ఈ నిరసనల్ని ముందుండి నడిపిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ విద్యార్థి సంఘాలైన నేతలు పోలీసుల చర్యలపై మండిపడ్డారు. వాంగ్‌చుక్‌ను ఆస్పత్రికి తరలించినప్పటికీ జంతర్ మంతర్ వద్ద ఆందోళనల్ని ఆపబోమని, పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. తానే స్వయంగా నిరాహార దీక్షను కొనసాగిస్తానని ప్రకటించారు. సోనమ్ వాంగ్‌చుక్ జులై 20న నిర్వహించ తలపెట్టిన పార్లమెంట్ మార్చ్ యథావిధిగా జరుగుతుందని స్పష్టం చేశారు. అయితే మార్చ్ నిర్వహణకు సీజేపీ ఇంకా దిల్లీ పోలీసుల నుంచి అధికారికంగా అనుమతులు తీసుకోలేదని సమాచారం. ఇక ఈ ఆందోళనలకు ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ వంటి ప్రధాన విపక్షాలన్నీ మద్దతు ప్రకటించడంతో రానున్న పార్లమెంట్ సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# విజయవాడ నుంచి కనెక్టివిటీ పెంచేందుకు ప్రయత్నాలు: కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

## మొదటి పేజి తరువాయి

అమరావతి : విజయవాడ నుంచి వివిధ ప్రాంతాలకు కనెక్టివిటీని పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇప్పటికే దిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు అదనపు సర్వీసులు నడుపుతున్నామని గుర్తుచేశారు. ఆగస్టు 13న విజయవాడ నుంచి వారణాసి మీదుగా కోల్‌కతాకు కొత్త విమాన సర్వీసు ప్రారంభిస్తామని చెప్పారు. విదేశాలకు వెళ్లే ప్రయాణికుల ఇమ్మిగ్రేషన్ కష్టాలను తొలగించేందుకు 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌ను విజయవాడలో ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏటీసీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. అంతకుముందు రామ్మోహన్ నాయుడు రూ.77 కోట్లతో నిర్మించిన నూతన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఏటీసీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భవన ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం రాత్రివేళ ఏటీసీ భవనం మిరమిట్లు గొలిపేలా చేసిన ప్రత్యేక అలంకరణను తిలకించి సిబ్బందిని ప్రశంసించారు. ఏవియేషన్ రంగానికి సంబంధించి అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పించాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది.

### గన్నవరం విమానాశ్రయంలో విమాన నియంత్రణ



### సేవల భవనం ప్రారంభం

అనంతరం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని శివనాథ్‌లతో కలిసి విమానాశ్రయ అభివృద్ధి పనులపై రామ్మోహన్ నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇంతవరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. దసరాకు నూతన టెర్మినల్ ప్రారంభమే లక్ష్యంగా పనులు సాగాలని రామ్మోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు. కొత్త టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణాన్ని వేగవంతం చేయడం ప్రభుత్వ ప్రాధాన్యంలో ఒకటని స్పష్టం చేశారు. పాత కాంట్రాక్టర్‌పై సీబీఐ కేసులు, ఇతర సమస్యల వల్ల పనులు నత్తనడకన సాగాయని రామ్మోహన్ నాయుడు చెప్పారు. అయితే దీనిపై వెంటనే స్పందించి, ఆ కాంట్రాక్టర్‌ను తొలగించి కొత్త కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించామన్నారు. కార్మికుల సంఖ్యను పెంచి, అవసరమైతే 24 గంటలపాటు పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్టోబర్ 15 దసరా నాటికి టెర్మినల్ నిర్మాణాన్ని పూర్తి చేసి, ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయాలని స్థానిక ఎంపీలు కేంద్రమంత్రిని కోరారు. "సీఎం చంద్రబాబు సైతం ఈ విమానశ్రయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. విమాన రాకపోకల ఆపరేషన్స్‌లో ఏటీసీ భవనం అత్యంత కీలకమైంది. గత 40-50 ఏళ్ల క్రితం నిర్మించిన పాత భవనం నుంచే ఇప్పటివరకు కార్యకలాపాలు సాగుతున్నాయి. ప్రస్తుతం విజయవాడలో విమానాల రద్దీ విపరీతంగా పెరిగిన నేపథ్యంలో రాబోయే 30-40 సంవత్సరాల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో, అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌తో రూ.77 కోట్లతో ఈ నూతన భవనాన్ని నిర్మించాం. - రామ్మోహన్ నాయుడు, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి విజయవాడ నుంచి ప్రపంచంలోని అన్ని ప్రధాన నగరాలకు కనెక్టివిటీ పెంచేలా కనీసం వారానికి రెండు సార్లయినా దుబాయ్‌కి ఎమిరేట్స్ విమానాన్ని నడపాలని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, రామ్మోహన్ నాయుడికి విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ఆఫ్రికా, అమెరికా, ఆసియా, యూరప్ దేశాలకు వెళ్లే ప్రయాణికులకు ఎంతో వెసులుబాటు కలుగుతుందని వివరించారు. రాబోయే శబరిమల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం కొచ్చిన్‌తో పాటు అహ్మదాబాద్, గోవాలకు కూడా సర్వీసులు నడపాలని విజయవాడ ఎంపీ శినేని శివనాథ్ కోరారు.

# మరో వివాదంలో నీట్ - ఆన్సర్ కీ ప్రకారం 522 మార్కులు- స్కోర్ కార్డులో మాత్రం 95 మార్కులు!

**ఆన్సర్ కీ ప్రకారం 522 మార్కులు రావాల్సి ఉందని మహారాష్ట్ర విద్యార్థి ఆరోపణ**

**అధికారిక స్కోర్‌కార్డులో 95 మార్కులే నమోదు చేశారని కుటుంబ సభ్యుల ఆవేదన- ఫలితాల్లో సవరణ లేకపోతే కోర్టును ఆశ్రయిస్తామన్న విద్యార్థి**


ఢిల్లీ : నీట్ యూజీ-2026 ఫలితాలు మరోసారి వివాదంలో చిక్కుకున్నాయి. మహారాష్ట్రకు చెందిన ఓ విద్యార్థి తన అధికారిక స్కోర్‌కార్డులో భారీ పొరపాటు జరిగిందని ఆరోపించాడు. ఆన్సర్ కీ ప్రకారం తనకు 522 మార్కులు రావాల్సి ఉండగా, స్కోర్‌కార్డులో కేవలం 95 మార్కులే చూపించారని పేర్కొన్నాడు.

### 522 మార్కులు రావాల్సి ఉందన్న విద్యార్థి

బీడ్ జిల్లాకు చెందిన సోహమ్ గవ్తే అనే విద్యార్థి విడుదలైన అధికారిక ఆన్సర్ కీ ఆధారంగా తన సమాధానాలను పరిశీలించగా 522 మార్కులు రావాల్సి ఉందని తెలిపాడు. అయితే, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసిన స్కోర్‌కార్డులో మాత్రం 95 మార్కులే నమోదయ్యాయని ఆరోపించాడు. దీంతో ఫలితాల్లో తీవ్ర లోపం జరిగిందని పేర్కొంటూ ఆయన అధికారికంగా అభ్యంతరం వ్యక్తం చేశాడు.

### కుటుంబంలో ఆందోళన

ఈ ఫలితంతో తమ కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైందని సోహమ్ కుటుంబ సభ్యులు తెలిపారు. ఏడాది పాటు ఎంతో కష్టపడి




నీట్ పరీక్షకు సిద్ధమైన తమ కుమారుడి భవిష్యత్తు ఈ ఫలితాల కారణంగా ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సోహమ్ తండ్రి మాట్లాడుతూ, "మా కుమారుడు ఎంతో కష్టపడి చదివాడు. కానీ ఫలితాల్లో జరిగిన ఈ గందరగోళం వల్ల అతని భవిష్యత్తు అంధకారంలో పడింది" అంటూ భావోద్వేగానికి గురయ్యారు. సోహమ్ తల్లి కూడా ఫలితాలు చూసిన తర్వాత కుమారుడు తీవ్ర మనోవేదనకు గురయ్యాడని, అతడిని ఓదార్చడం తమకు చాలా కష్టంగా మారిందని చెప్పారు.

### కోర్టును ఆశ్రయిస్తామన్న కుటుంబం

ఫలితాల్లో జరిగినట్లు చెబుతున్న ఈ వ్యత్యాసాన్ని వెంటనే సరిదిద్దాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ ఆరోపణలపై ఎన్‌టీఏ ఎలా స్పందిస్తుందనే అంశంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నీట్ యూజీ-2026 ఫలితాల ఖచ్చితత్వంపై మరోసారి ప్రశ్నలు తలెత్తిన నేపథ్యంలో, ఈ వ్యవహారాన్ని అత్యవసరంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షపై ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలు వెల్లువెత్తడంతో మే 12న ఎన్‌టీఏ పరీక్షను రద్దు చేసింది. అనంతరం జూన్ 21న దేశవ్యాప్తంగా మళ్లీ రీ-ఎగ్జామినేషన్ నిర్వహించింది. దీనిని దర్యాప్తు చేస్తున్న సీబీఐ కీలక విషయాన్ని తెలిపింది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన కోచింగ్ సెంటర్ యజమాని శివరాజ్ రఘునాథ్ మోటేగావ్‌కర్, పరీక్షకు ముందే కెమిస్ట్రీ ప్రశ్నలు సంపాదించేందుకు రూ.5 లక్షలు చెల్లించినట్లు ప్రత్యేక కోర్టుకు సీబీఐ తెలిపింది. ప్రశ్నాపత్రం లీక్ కుట్రలో మోటేగావ్ కర్ పాత్ర ఉందని తెలిపింది. మోటేగావ్‌కర్ కుమారుడు కులకర్ణి నిర్వహిస్తున్న కెమిస్ట్రీ కోచింగ్ తరగతులకు హాజరవుతున్నట్లు తెలిపింది. ఆ తరగతుల్లోనే లీకైన ప్రశ్నలు అందించినట్లు ఆరోపించింది. అందిన ప్రశ్నలను మోటేగావ్‌కర్ స్వయంగా చేతితో నోట్స్ రూపంలో రాసుకున్నట్లు పేర్కొంది. దర్యాప్తులో భాగంగా స్వాధీనం చేసుకున్న మోటేగావ్‌కర్ మొబైల్ ఫోన్‌లో 36 చిత్రాలు లభించినట్లు సీబీఐ వెల్లడించింది. వాటిలో ఐదు డూప్లికేట్ చిత్రాలు ఉండగా, మొత్తం 132 చేతిరాత కెమిస్ట్రీ ప్రశ్నలు ఉన్నట్లు తెలిపింది. వీటిలో 111 ప్రశ్నలు ఎన్‌టీఏ రూపొందించిన నీట్-యూజీ 2026 అసలు మాస్టర్ ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలతో సరిపోలినట్లు సీబీఐ పేర్కొంది. ఈ డిజిటల్ ఆధారాలు కేసులో కీలక సాక్ష్యాలుగా నిలుస్తాయని పేర్కొంది. నిందితుడు శివరాజ్ ఇచ్చిన 5 లక్షల నగదును సహ నిందితుల నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నీట్ పేపర్ లీక్ కేసులో ఇప్పటివరకు 13 మందిని సీబీఐ అరెస్ట్ చేసింది.

# సంపాదకీయం

## దళితబహుజన వాదానికి కొత్త పిలుపు

అడకత్తెరలో పోకచెక్క అనే సామెత ఉంది. ముందు నుయ్యి, వెనుక గొయ్యి అనే సామెత కూడా ఉంది. ప్రస్తుతం ఈ సామెతలు అన్వయించే క్లిష్ట సందర్భంలో 'హిందూ దళిత బహుజనులు' ఉన్నారు. దళిత బహుజన పౌరులందరూ నాస్తికులు కారు. వారికి మతం గురించిన ఆసక్తులు ఉంటాయి. వారు తమ మతాసక్తులు దెబ్బతినకుండా కాపాడుకోవడంలో ఏ తప్పూ లేదు. హిందూ దళిత బహుజనుల ఆసక్తులు రెండు: ఒకటి మతం, రెండు సామాజిక న్యాయం. కానీ హిందూ దళిత బహుజనులు ఈ రెండు ఆసక్తులనూ నెరవేర్చని రెండు భిన్న భావజాలాల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. వాటిల్లో ఒకటి ఆరెస్సెస్ హిందూ భావజాలం, రెండవది లౌకికవాద నాస్తిక దృక్పథం. ఈ రెండు దృక్పథాలు వారిలోని ఒక ఆసక్తిని నెరవేరిస్తే, ఇంకొక ఆసక్తిని నెరవేర్చే పరిస్థితి లేదు. హింసను ఎదుర్కోవడం పట్ల గాంధీజీ జైనమత దృక్పథాన్ని ఆరెస్సెస్ భావజాలం నిరసిస్తుంది. మతం కంటే దేశానికే అగ్రతాంబూలం ఇస్తుంది. జైన, బౌద్ధ మతాలను భారతీయ మతాలుగా గుర్తిస్తోంది. మెజారిటీ ప్రజలైన హిందూ జాతి సాంస్కృతిక వైభవాన్ని గుర్తించి, వ్యక్తి సచ్ఛీలతకు, దేశభక్తికి పునాదులు వేస్తోంది. కానీ దళిత బహుజనుల సామాజిక న్యాయాన్ని నిర్లక్ష్యం చేస్తున్నది. వర్ణధర్మాలను(వృత్తి ధర్మాలను) భగవద్గీత గుణకర్మలతో ముడిపెట్టింది కానీ, పుట్టుకతో ముడిపెట్టలేదు. ఈ విధంగా భగవద్గీతలో చెప్పినదే ఆధునిక చింతన కూడా! కానీ మధ్యయుగాలలో అమలైన 'ను మాత్రమే ఆరెస్సెస్ స్థిరీకరించే ప్రయత్నం చేస్తోంది. ఇది హిందూ దళిత బహుజనుల సామాజిక న్యాయానికి పెనుప్రమాదం! కాబట్టి హిందూ దళిత బహుజనులు ఆరెస్సెస్ వైపు మొగ్గుచూపడం ఆరోగ్యకరం కాదు. ఆరెస్సెస్‌లోగానీ, దాని అనుబంధ రాజకీయపార్టీ బీజేపీలోగానీ వారిమత, సాంస్కృతిక ఆసక్తులు నెరవేరుతాయి కానీ, సామాజిక న్యాయం సమకూరదు. ఇక రెండవది, లౌకికవాద నాస్తిక దృక్పథం. నాస్తికత్వం భౌతిక జీవితానికి తప్ప, అలౌకిక అన్వేషణకు ప్రాధాన్యం ఇవ్వదు, ఖండిస్తుంది కూడా. సెక్యులరిస్టులు కానీ, మార్క్సిస్టులు కానీ నాస్తికులైనవారు మతాన్ని అధ్యయనం చేయరు. అవసరం కూడా లేదు అనుకుంటారు. కానీ వీరికి మతం పట్ల గుడ్డి నిరాకరణ మాత్రం ఉంటుంది. ఇక్కడ ఒక ప్రమాదం పొంచివుంది. మతం గురించి తెలియనివాళ్లకు ఆ జాతి సంస్కృతి తెలియదు. సంస్కృతి తెలియనివాళ్లకు ఆ జాతి భావావేశాలూ అర్థం కావు. ఇటువంటి నాస్తిక మేధావుల మధ్య, వారి సంస్థలలో దళిత బహుజనుల మతభావాలు సహజంగానే దెబ్బతింటాయి. ప్రశ్నకు గురవుతాయి. దళిత బహుజనులకు తమ మతం పట్ల, తమ సంస్కృతి పట్ల ఉన్న భావావేశాలు, ఈస్థటిక్స్ నాస్తిక సమూహాల మధ్య సంతృప్తి పొందవు. ఈ విధంగా తమ సామాజిక న్యాయాన్ని విస్మరించిన ఆరెస్సెస్, బీజేపీ ఒకవైపు; తమ జాతినీ, సాంస్కృతిక అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేసే నాస్తికవాదం మరొకవైపు ఈ రెండూ హిందూ దళిత బహుజనులకు ఆమోదయోగ్యం కాలేవు. ఈ క్రమంలోనే దళిత బహుజనులు ఈ రెండు భిన్నధృవాలకు మధ్యస్థంగా, స్వతంత్రంగా ఆలోచించక తప్పదు. ఆరెస్సెస్ శక్తులకు, నాస్తికవాద శక్తులకు దూరంగా తమ హిందూ దళిత బహుజన అస్తిత్వాన్ని ఆవిష్కరించుకోవాలి. దళిత బహుజనుల్లో కొందరికి హిందూ పదాన్ని జోడించడమే ఇష్టం ఉండదు. అందుకు క్రిస్టియన్, ఇస్లాం మేధావులకు, లౌకికవాదులు, మార్క్సిస్టులకు ఎవరి కారణాలు వారికి ఉన్నాయి. క్రిస్టియన్ మేధావులకు హిందూ దళితుల పట్ల అసహనం ఉండవచ్చు. హిందూ మతం వారిని గుళ్లకు దూరం చేసినా, ఊరి బయటకు తరిమినా ఇంకా ఆ మతాన్నే పట్టుకుని వేలాడుతున్నారని కోపం ఉండవచ్చు. ఈ కోపం సకారణమే. కాబట్టి మనం అర్థం చేసుకోనువచ్చు. దళితులు, దళిత క్రిస్టియన్లు హిందూమతం పట్ల రియాక్షనరీస్‌గా మారడం సహజమే. అందుకు మనుధర్మ శాస్త్రమే కారణం. దీనిని హిందూ సమాజం బహిష్కరించవలసిందే! ముస్లింల రియాక్షన్‌కు సామాజిక దౌష్ట్యాలు కారణం కాదు. హిందూమతం పట్ల వారి రియాక్షన్‌కు వారు నమ్మిన ఇస్లాం మతగ్రంథాలే కారణం. ముస్లింలు హిందూమతంలోని అస్పృశ్యతను ప్రశ్నిస్తారు. వర్ణధర్మాన్ని ప్రశ్నిస్తారు. మనుధర్మ శాస్త్రాన్ని దండిస్తారు. బ్రాహ్మణాధిక్యతను ఎత్తిచూపుతారు. ఈ విమర్శలన్నిటినీ హిందూ దళిత బహుజనులు ఆహ్వానిస్తారు, ఆమోదిస్తారు కూడా! మైనారిటీ మతాలతో హిందూ దళిత బహుజనులు సహజీవనాన్ని కోరుకుంటారు. సహజీవనానికి అవసరమైన సంస్కరణలను ఆ మతాల నుంచి కూడా ఆశిస్తారు. ముస్లింలు యుద్ధ జిహాద్‌ను ఖండించాలని, ప్రపంచాన్ని ఇస్లాం రాజ్యంగా మార్చాలనే అప్రజాస్వామికతను ప్రశ్నించాలని, అన్యమతాల పట్ల కాఫిర్లు అనే శత్రుభావాన్ని విడనాడాలని.. హిందూ దళిత బహుజనులు కోరుకుంటారు. వర్తమానంలో హిందూ, ఇస్లాం శక్తులకు ఎవరి రాజకీయాలు వారికి ఉన్నాయి. ఎవరి వ్యూహాలు వారికి ఉన్నాయి. 2030 సంవత్సరం అంటూ ఒకరు, 2047వ సంవత్సరం అంటూ ఒకరు తమ వ్యూహాలు అమలు చేయబోయే కాల నిర్ణయాలు కూడా జరిగిపోతున్నాయి. ఈ ప్రమాదానికి విరుగుడు ఆరెస్సెస్, బీజేపీలు కాదు. నాస్తిక మార్క్సిస్టులూ కాదు. హిందూ, అబ్రహామిక్ మతాల మధ్య అపోహలు లేని సహజీవనమే ఇప్పుడు కావలసినది. ఇందుకు అనుగుణంగా ఎవరి మతాలను వారు సంస్కరించుకోవలె, శుభ్రపరచుకోవలె, ప్రజాస్వామ్యీకరించుకోవలె! హిందూ దళిత బహుజనవాదం మధ్యయుగాల మతవ్యవస్థను నిరాకరిస్తుంది. తమ మతాన్ని ప్రజాస్వామ్యీకరించుకునేందుకు పోరాడుతోంది. బ్రాహ్మణాధిపత్యాన్ని అంగీకరించదు. అన్ని చారిత్రక కాలాల్లోనూ మతగ్రంథాలను కాపాడుతూ వచ్చిన బ్రాహ్మణుల చారిత్రక పాత్రను గుర్తిస్తుంది. దేశమా? మతమా? అంటే దేశానికే మొదటి ప్రాధాన్యం

# ఆరోగ్యాన్ని హరిస్తున్న ఆహార కల్తీ!



ఆహారం... జీవకోటికి ప్రాణాధారం. మానవ మనుగడకు ప్రాథమిక అవసరం. అదిప్పుడు స్వార్థపరుల చేతుల్లో విషంగా మారుతోంది. పాలు, నూనెలు, మసాలాలు, పండ్లు, పసిపిల్లల పాలపొడిదాకా ప్రతిదీ కల్తీమయమవుతోంది. ఇది కేవలం ఒక చట్టపరమైన నేరమో, వ్యాపార మోసమో కాదు; యావత్ సమాజంపై జరుగుతున్న నిశ్శబ్ద దాడి! ఆహార కల్తీ కారణంగా వైద్య ఖర్చులు పెరిగి, ఉత్పాదకత దెబ్బతిని కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో మునిగిపోతున్నాయి. ప్రభుత్వాల ఆరోగ్య వ్యయాలూ విపరీతంగా పెరుగుతున్నాయి. అనారోగ్యాలతో వైద్య ఖర్చులు అధికమై ఉత్పాదకత తగ్గి అంతర్జాతీయంగా ఏటా దాదాపు 26 లక్షల కోట్ల రూపాయల ఆర్థిక నష్టం వాటిల్లుతోంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో హైదరాబాద్ సిటీ పోలీస్ విభాగం ప్రవేశపెట్టిన 'ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్-ఫాస్ట్)' క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు చేపడుతోంది. ఈ విభాగం ఏర్పాటైన వందరోజుల్లో నమోదు చేసిన 185 కేసుల్లో సుమారు 121.87 టన్నుల అత్యంత ప్రమాదకరమైన కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుంది. మరో 250 కేసులను జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులకు అప్పగించింది. ఆధునిక పారిశ్రామికీకరణ, అంతర్రాష్ట్ర వాణిజ్యం, ఈ-కామర్స్, రవాణా రంగాల్లోని విప్లవాత్మక పురోగతి ఆహార కల్తీకి సంఘటిత నేరం రూపంలో కొత్త స్వరూపాన్ని ఇచ్చింది. ఒకే బ్యాచ్‌లో తయారైన కల్తీ ఆహారం క్షణాల్లో వేలాది ఇళ్లకు చేరి ప్రజల ఒంట్లోకి చేరుతుంది. దీని దుష్ప్రభావాలు కొంతకాలం తర్వాత దీర్ఘకాలిక వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. దీనివల్ల బాధితులు తమ అనారోగ్యానికి అసలు కారణం కల్తీ ఆహారమేనని గుర్తించలేని విషాదకర స్థితి నెలకొంటోంది. అందుకే దీన్ని సమాజంపై జరుగుతున్న వ్యవస్థీకృత దాడిగా భావించాలి.


### విదేశాల్లో మేలిమి విధానాలు

కల్తీ మహమ్మారిని ఎదుర్కోవడంలో అంతర్జాతీయ సమాజం అవలంబిస్తున్న విధానాలు మనకెన్నో పాఠాలు నేర్పుతాయి. అమెరికాలోని ఎఫ్‌డీఏ అమలు చేస్తున్న ఆహార భద్రత ఆధునికీకరణ చట్టం కల్తీ జరగక ముందే అడ్డుకోవడంపై దృష్టి పెడుతుంది. ఐరోపా యూనియన్ అవలంబిస్తున్న ఫామ్ టు ఫోర్క్ విధానం ఆహార సరఫరా గొలుసులో పారదర్శకతను పెంచుతోంది. సింగపూర్, చైనా కూడా కల్తీ రుజువైతే భారీ జరిమానాలు, కఠినమైన జైలు శిక్షలు విధిస్తున్నాయి. మన దేశంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ వంటి వ్యవస్థలు ఉన్నా, వాటి పరిధి ప్రధానంగా నాణ్యత నిబంధనల రూపకల్పన, లైసెన్సుల మంజూరుకే పరిమితమవుతోంది. స్వాతంత్ర్యానంతరం దేశవ్యాప్తంగా ఏకీకృత ఆహార ప్రమాణాలను నిర్దేశించేందుకు ప్రవేశపెట్టిన ఆహార కల్తీ నిరోధక చట్టం-1954 స్థానంలో వచ్చిన ఆహార భద్రత ప్రమాణాల చట్టం-2006 ఎఫ్ఎస్ఎస్ఏఐ వంటి వ్యవస్థలను ఏర్పరిచింది. అధికారులకు తనిఖీలు, నమూనాల సేకరణకు చట్టపరమైన అధికారాన్ని ఇచ్చింది. కానీ, ప్రస్తుత సవాళ్లను తట్టుకోవడానికి ఈ చట్ట పరిధి సరిపోవడం లేదు. ఆహార భద్రత ప్రమాణాల చట్టం-2006లోని శాస్త్రీయ, నియంత్రణ విధులను యథాతథంగా కొనసాగిస్తూనే- సంఘటిత రూపం దాల్చిన తీవ్రమైన కేసుల్లో నేర న్యాయవ్యవస్థను మరింత పటిష్ఠంగా అనుసంధానం చేయాలి. లాభార్జనే ధ్యేయంగా విషపూరిత పదార్థాలను ఆహారంలో కలిపి వేలమంది ప్రాణాలను పణంగా పెట్టే కల్తీదారులను, కేవలం నాణ్యతా ప్రమాణాల్లో స్వల్ప లోపాలకు బాధ్యులైన సాధారణ విక్రేతలతో సమానంగా చూడలేం. అందుకే, బీఎన్ఎస్-2023 లేదా ఆహార భద్రతా చట్టం పరిధిలో తీవ్ర స్వరూపంగల ఆహార కల్తీ అనే ప్రత్యేక నేర విభాగాన్ని ప్రవేశపెట్టడం అత్యంత అవసరం. దీంతోపాటు బీఎన్ఎస్-23లోనూ తగిన సవరణలు చేయడం ద్వారా తీవ్రమైన ఆహార నేరాలపై క్రిమినల్ న్యాయవ్యవస్థ పూర్తిస్థాయిలో స్పందించేలా మార్గాలను సుగమం చేయాలి. ఈ క్లిష్టమైన నేరాలను ఎదుర్కోవడానికి పాలసీ, అథారిటీ, ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ల మధ్య ఏకీకృత త్రిముఖ వ్యూహం అవసరం. ఇందుకు జాతీయ స్థాయిలో ఒకే రకమైన లక్ష్యాలతో సమగ్ర నేషనల్ ఫుడ్ క్రైమ్ పాలసీని రూపొందించాలి. ఈ విధానాన్ని అమలు చేయడానికి ఎన్‌సీబీ, ఎన్ఐఏ తరహాలో స్వతంత్ర దర్యాప్తు, అరెస్ట్ అధికారాలు కలిగిన ఒక జాతీయ ఆహార భద్రతా అథారిటీని ఏర్పాటు చేయాలి. సరిహద్దుల లొసుగులను పూడ్చడానికి సదరు అథారిటీ కింద నేషనల్ ఫుడ్ క్రైమ్ ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ పనిచేయాలి. అథారిటీ పరిధిలోనే కేంద్రీకృత ఫోరెన్సిక్ ల్యాబ్‌ల నెట్‌వర్క్‌ను పర్యవేక్షించడం ద్వారా శాస్త్రీయ ఆధారాలను కోర్టుల ముందుంచి దోషులకు వేగంగా శిక్షలు పడేలా చేయవచ్చు.

### విస్తృత అవగాహన అవసరం

ఆహార కల్తీని అరికట్టేందుకు పోలీస్, ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్, వ్యవసాయ, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో ఉమ్మడి కార్యాచరణను అమలు చేయాలి. క్షేత్రస్థాయి పరిశోధనలకు ఏఐ ఆధారిత రాపిడ్ స్క్రీనింగ్ టూల్స్, బ్లాక్‌చైన్ సాంకేతికత ఆధారిత 'ఫార్మ్-టు-ఫోర్క్' ట్రేసబిలిటీ విధానాలను జోడించాలి. మొబైల్ టెస్టింగ్ ల్యాబ్స్ ద్వారా తనిఖీలను గ్రామీణ స్థాయిలోనూ చేపట్టినప్పుడే కల్తీ మూలాలను సులభంగా పట్టుకోవచ్చు. ఆహార కల్తీలపై తక్షణ ఫిర్యాదులకు ప్రత్యేక టోల్-ఫ్రీ నంబర్ తీసుకురావాలి. ఆహార కల్తీ నిరోధంలో పౌరుల్లో నెలకొన్న ఉదాసీనత, నిర్లిప్త ధోరణులు మంచివి కావు. కల్తీని చూసీచూడనట్లు వదిలేస్తే, భావితరాల భవిష్యత్తు బుగ్గిపాలవుతుందనే సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ఆహార వ్యాపారులూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి. వినియోగదారులు సైతం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, ఇళ్లలోనే సులభంగా కల్తీని గుర్తించేందుకు వీలు కల్పించే 'ఎఫ్ఎస్ఎస్ఏఐ డార్ట్' కిట్ల వాడకంపై అవగాహన పెంచుకోవాలి. ఆహార అక్రమాలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా అధికారుల దృష్టికి తీసుకురావాలి. పాఠశాల స్థాయి నుంచే ఆహార భద్రతపై నవతరానికి విస్తృత అవగాహన కల్పించాలి. ప్రభుత్వాల దృఢ సంకల్పం, వ్యాపారుల నైతిక ప్రవర్తన, క్రియాశీలక ప్రజా చైతన్యం తోడైనప్పుడే కల్తీరహిత సమాజం సాకారమవుతుంది.

# డోపమైన్ బానిసలవుతున్న చిన్నారులు.. ఎవరి బాధ్యత?







ఒకప్పుడు సాయంత్రం అయిందంటే వీధులన్నీ పిల్లల ఆటపాటలతో, అరుపులతో సందడిగా ఉండేవి. కానీ నేడు ఇళ్లల్లో నిశ్శబ్దం రాజ్యమేలుతున్నది. పిల్లల చేతుల్లో మొబైల్ స్క్రీన్లు వెలుగుతున్నాయి. ఆధునిక సాంకేతిక విప్లవం మానవ జీవితాన్ని సులువు చేసిన మాట నిజమే అయినప్పటికీ, అది నేటి తరం పిల్లల బాల్యాన్ని, ముఖ్యంగా 9-12 ఏండ్ల లోపు వయసున్న చిన్నారుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నది. రంగురంగుల గ్రాఫిక్స్, అద్భుతమైన శబ్దాలు, క్షణాల్లో లభించే వర్చువల్ రివార్డులతో ఆన్‌లైన్ గేమింగ్ ప్రపంచం పిల్లలను ఒక మాయాజాలంలో బంధిస్తున్నది. కేవలం కాలక్షేపం కోసం మొదలయ్యే ఈ అలవాటు, క్రమంగా వారి మానసిక ఎదుగుదలను దెబ్బతీసే ఒక తీవ్రమైన వ్యసనంగా మారిపోతున్నది.

### తీజన్ బాయిడోపమైన్ ఉచ్చు.. ఏకాగ్రతకు భంగం

ఆన్‌లైన్ గేమ్స్ కొన్ని ప్రత్యేకమైన షార్ట్ వీడియో యాప్‌లు పిల్లల మెదడులోని రసాయన సమతుల్యతను పూర్తిగా మార్చేస్తున్నాయి. ఈ యాప్‌లు పిల్లలను ఆకర్షించేలా, ప్రతి కొన్ని సెకన్లకూ ఒక కొత్త ఉత్సాహాన్ని ఇచ్చేలా అల్గారిథమ్‌లను రూపొందించుకున్నాయి. గేమ్‌లో ఒక లెవెల్ దాటడం లేదా ఒక టాస్క్ పూర్తి చేయగానే లభించే పాయింట్లు పిల్లల మెదడులో 'డోపమైన్' అనే రసాయనాన్ని విపరీతంగా విడుదల చేస్తాయి. ఇది 'ఇన్‌స్టంట్ గ్రాటిఫికేషన్' అలవాటు చేస్తుంది. దీనివల్ల పిల్లలు ప్రతి ఐదు నిమిషాలకూ ఫోన్ చూడకుండా ఉండలేకపోతున్నారు. ఫలితంగా వారిలో ఏకాగ్రత లోపించడం వంటి తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయి. ఫలితంగా పుస్తకాలు చదవడం, హోంవర్క్ చేయడంపై దృష్టి పెట్టలేకపోతున్నారు. చివరికి క్లాసు రూముల్లో టీచర్లు చెప్పే పాఠాలపై కూడా ఏకాగ్రత పెట్టలేకపోతున్నారు. చిన్న విషయాలకే చిరాకు పడటం, మొండిగా ప్రవర్తించే స్థాయికి చేరుతున్నారు. ఫలితంగా వారు చేస్తున్న పనులను వారు ఆమోదించలేక చివరికి తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

### యాప్‌ల టార్గెట్.. పిల్లలే

ప్రస్తుతం డిజిటల్ మార్కెట్లో ఉన్న అనేక వీడియో షేరింగ్ ప్లాట్‌ఫారమ్‌లు, ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లు వ్యూహాత్మకంగా 9 నుంచి 12 ఏళ్ల లోపు పిల్లలనే తమ ప్రధాన టార్గెట్‌గా ఎంచుకుంటున్నాయి. ఈ వయస్సులో పిల్లల మెదడు వేగంగా అభివృద్ధి చెందుతుంటుంది. ఏది మంచి, ఏది చెడు అని నిర్ణయించుకునే విచక్షణ పూర్తిగా పరిపక్వం చెందదు. టెక్ కంపెనీలు ఈ బలహీనతను ఆసరాగా చేసుకుని, పిల్లలు ఆయా యాప్‌లకు బానిసలయ్యేలా ఆకర్షణీయమైన అప్‌డేట్‌లను ఇస్తుంటాయి. ఒక్కసారి వాటి ఉచ్చులో పడితే పిల్లలు బాహ్య ప్రపంచాన్ని, తోటి స్నేహితులను, ఆటలనే కాదు.. తమ సొంత కుటుంబ సభ్యులను కూడా మర్చిపోయే పరిస్థితికి వచ్చే ప్రమాదం లేకపోలేదు.

### పొంచి ఉన్న సైబర్ ముప్పు..

ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌ల వల్ల కుటుంబాల భద్రత కూడా తీవ్రమైన ప్రమాదంలో పడుతున్నది. నేడు పిల్లలు తమ తల్లిదండ్రుల మొబైల్ ఫోన్లనే ఆటల కోసం వాడుతున్నారు. ఈ ఫోన్లలోనే తల్లిదండ్రుల వ్యక్తిగత సమాచారం, గ్యాలరీ ఫోటోలు, ఇ-మెయిల్లతో పాటు బ్యాంక్ ఖాతాల వివరాలు ఉంటాయి. సైబర్ నేరగాళ్లు, హ్యాకర్లు పిల్లల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని గేమ్స్ ముసుగులో మాల్వేర్‌లను పంపుతుంటారు. ఉచితంగా పాయింట్లు వస్తాయని లేదా గేమ్‌లో కొత్త ఆయుధాలు, దుస్తులు లభిస్తాయని నమ్మి పిల్లలు ఆ లింక్‌లను క్లిక్ చేస్తుంటారు. దీనివల్ల హ్యాకర్లు ఆ ఫోన్‌ను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని వ్యక్తిగత, బ్యాంక్ వివరాలను హ్యాక్ చేసి అకౌంట్లలోని సొమ్మును ఊడ్చేయడం వంటి నేరాలకు పాల్పడుతున్నారు.

### బాల్యాన్ని కాపాడుకుందాం!

కుటుంబంలో రోజుకు కనీసం ఒకటి లేదా రెండు గంటల పాటు ఎవరూ మొబైల్ ఫోన్లు వాడకూడదనే నియమాన్ని పెట్టుకోవాలి. ముఖ్యంగా భోజనం చేసేటప్పుడు, పడుకునే ముందు స్క్రీన్లకు దూరంగా ఉండాలి. వారంలో ఒక రోజును 'నో గ్యాడ్జెట్ డే' గా ప్రకటించి పిల్లలతో సమయం గడపాలి. ఈత, సైక్లింగ్, బ్యాడ్మింటన్ వంటి శారీరక శ్రమతో కూడిన ఆటల వైపు పిల్లలను మళ్లించాలి. చైనా తరహాలోనే మైనర్ల ఆన్‌లైన్ గేమింగ్ సమయంపై పరిమితులు విధించే చట్టాలను తీసుకురావాలి. 9-12 ఏళ్ల పిల్లలను టార్గెట్ చేసే యాప్‌లపై కఠినమైన నిఘా ఉంచాలి. పిల్లలకు ఫోన్లు ఇచ్చేటప్పుడు వాటిలో పేరెంటల్ కంట్రోల్ యాప్స్ ఇన్‌స్టాల్ చేయాలి. బ్యాంకింగ్.. వ్యక్తిగత యాప్‌లకు బలమైన పాస్‌వర్డ్‌లు, బయోమెట్రిక్ లాక్‌లను ఏర్పాటు చేయాలి. గుర్తుతెలియని లింక్‌లను క్లిక్ చేయకూడదని పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి. అల్గారిథమ్‌ల మాయాజాలంలో చిక్కుకుని నేటి బాల్యం నిర్వీర్యమైపోతుంటే చూస్తూ ఊరుకోవడం సమాజంగా మనందరి వైఫల్యమే అవుతుంది. కాలుష్యం కంటే ప్రమాదకరమైన ఈ డిజిటల్ చెర నుండి పిల్లలను కాపాడుకోవడానికి తల్లిదండ్రులు, విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వాలు బాధ్యత వహించాలి. అప్పుడే మనం ఒక ఆరోగ్యకరమైన, సృజనాత్మకత కలిగిన బలమైన నవభారతాన్ని నిర్మించగలం.

# అటు పంటతడి.. ఇటు కంటతడి



కళ్లముందే పారుతున్న గోదావరి నీళ్లను పాలకులు దిగువకు వదిలి వేస్తుంటే తెలంగాణ రైతులు అల్లాడిపోతున్నారు. దశాబ్దాలుగా సాగునీటి కొరతతో నలిగిపోయిన నేలకు ప్రతి చుక్క నీరు ఎంతో విలువైనది. కాళేశ్వరం లాంటి మల్టీ లెవెల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను వదిలేసి, అనవసరమైన ఊహలు, భయాల చుట్టూ పాలకులు కాలయాపన చేయడం వల్ల అన్నదాతలకు తీరని అన్యాయం జరుగుతున్నది. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తెలంగాణ విశ్రాంత నీటిపారుదలశాఖ ఇంజినీర్లు, నిపుణులు తప్పుబడుతున్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నీటిని ఎత్తిపోయాలని సూచిస్తున్నారు. కానీ ప్రభుత్వం మొండికేయడం తెలంగాణ ప్రభుత్వం, నీటిపారుదలశాఖ అధికారుల నిర్లక్ష్యంతో గోదావరి జలాలు మొత్తం దిగువకు వెళ్తున్నాయి. ఈ నీటిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాడుకుంటున్నది. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టా స్థిరీకరణకు వినియోగిస్తున్నది. ఇంకా మిగిలిన నీటిని ధవళేశ్వరం బరాజ్ నుంచి డైవర్షన్ చేసి వాడుకుంటున్నది. వాళ్లు వాడుకోగా మిగిలిన నీరు మాత్రమే సముద్రం పాలవుతున్నది. మన గడ్డపై ప్రాజెక్టులు ఉండి, నది నిండుగా ప్రవహిస్తున్నా తెలంగాణ రైతులకు నీరు అందకపోవడం రైతుల్లో, ప్రజల్లో ఆగ్రహాన్ని కలిగిస్తున్నది. మేడిగడ్డ బరాజ్ గేట్లు మూయకుండానే, సహజంగా వస్తున్న నదిని వినియోగించుకొని నీటిని లిఫ్ట్ చేసే సౌకర్యం ఉన్నది. గోదావరి, ప్రాణహిత నదుల నుంచి మేడిగడ్డ వద్దకు కనీసం 50,000 క్యూసెక్కుల ప్రవాహం వచ్చినప్పుడు, నదిలో నీటి మట్టం సహజంగానే +90 నుంచి +91 మీటర్ల ఎత్తుకు చేరుకుంటుంది. బరాజ్ గేట్లన్నీ తెరిచి ఉంచినా కూడా, ఈ మట్టం వద్ద నీరు కన్నెపల్లి పంప్ హౌస్ అప్రోచ్ చానెల్‌లోకి సులభంగా ప్రవహిస్తుంది. కాబట్టి మేడిగడ్డ బరాజ్‌పై ఒత్తిడి లేకుండానే పంప్ చేసుకోవచ్చు. కన్నెపల్లి పంప్ హౌస్ నడిపితే వచ్చే వైబ్రేషన్ల వల్ల మేడిగడ్డ బరాజ్ కూలిపోతుందన్న కాంగ్రెస్ నేతల వాదనను విశ్రాంత ఇంజినీర్లు పూర్తిగా తోసిపుచ్చుతున్నారు. కేవలం తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే అబద్ధాలను ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలుకుతున్నారు. సమైక్య రాష్ట్రంలో దశాబ్దాలుగా తెలంగాణ రైతులు అనుభవించిన వేదనకు ముగింపు పలకడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ కారణాలతో కాంగ్రెస్ సర్కార్ పడావు పెట్టడం సరికాదు. వందలాది టీఎంసీల గోదావరి వరద జలాలు కండ్ల ముందే తరలిపోతుంటే, రైతులు ఆకాశం వైపు దీనంగా చూస్తూ కన్నీరు మున్నీరవుతున్నారు. పాలకులు ఊహాజనిత, కుట్ర పూరిత వైఖరితో వ్యవహరించడం తెలంగాణ రైతులకు ద్రోహం చేయడమే అవుతుంది. ఎల్ నినో లాంటి భయంకరమైన వాతావరణ పరిస్థితిలో కూడా కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగించకపోతే తెలంగాణ ప్రజలకు తీవ్రమైన అన్యాయం చేసినట్టే. మేడిగడ్డ బరాజ్‌లో రెండు పిల్లర్లు కుంగిపోవడాన్ని సాకుగా చూపి ఎగువన ఉన్న అన్నారం (సరస్వతి), సుందిళ్ల (పార్వతి) బరాజ్‌లను కూడా నిరుపయోగంగా వదిలేయడం ఎంతవరకు సమంజసం? ఈ రెండు బరాజ్‌లకు అవసరమైన చిన్నపాటి మరమ్మతులు పూర్తయి, ప్రస్తుతం అవి 100 శాతం నీటిని నిల్వ చేయడానికి, తరలించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ రెండు బరాజ్‌లను నింపడం ద్వారా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రధాన జలాశయాలను నింపే అద్భుతమైన అవకాశం ఉన్నది. కానీ, ప్రాథమిక ఇన్‌టేక్ వ్యవస్థను తాకడానికి కూడా ప్రభుత్వం నిరాకరిస్తున్నది. మోటార్లు నడిపిస్తే వాటి కంపనాలతో బరాజ్ కుంగిపోతుందని అవాస్తవాన్ని అపోహను ప్రచారం చేస్తున్నది. ఇది పూర్తిగా అబద్ధం, హాస్యాస్పదం. కన్నెపల్లి పంప్ హౌస్ నడిపిస్తే వచ్చే కంపనాల వల్ల మేడిగడ్డ బరాజ్ మరింత కూలిపోతుందనే అధికారుల వాదనను నిపుణులు పూర్తిగా కొట్టిపారేస్తున్నారు. భౌగోళికంగా కన్నెపల్లి పంప్ హౌస్ మేడిగడ్డ బరాజ్‌కు దాదాపు 1-2 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. పైగా ఈ రెండింటి పునాదులు ఒకదానికొకటి సంబంధం లేని 'ఐసోలేటెడ్ ఫౌండేషన్స్'. ఇంత దూరం ఉన్నా పంపుల వల్ల బరాజ్ కూలిపోతుందనడం సాంకేతికంగా అబద్ధం. ఇది కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించడానికి, బాధ్యతల నుంచి తప్పించుకోవడానికి చెప్తున్న సాకులు. రాజకీయ లెక్కలు, బ్యూరోక్రాటిక్ సమస్యలు, పట్టింపులను పక్కనబెట్టి, ఇంజినీరింగ్ ప్రతిభకు పదును పెట్టాల్సిన సమయం ఇది. పనిచేసే స్థితిలో ఉన్న అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు ఎలాంటి ముప్పు రాకుండానే, 'రన్-ఆఫ్-ది-రివర్' పద్ధతిలో నీటిని మళ్లించడం ప్రస్తుత సంక్షోభానికి తక్షణ మార్గం. ఉరకలేస్తున్న గోదావరిని తెలంగాణ జలాశయాలకు మళ్లించడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలి. లేదంటే, నది పారినా తాగునీరు, సాగునీరు లేక తెలంగాణ కరువు కాటకాల్లో మునిగిపోతుంది. ఆ పాపం కాంగ్రెస్ పాలకులదే అవుతుంది. అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

## వృద్ధుడికి ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా అత్యాధునిక స్టెంట్


### గుండెపోటు రోగులకు నూతన జీవితం



అనంతపురం: 2026 : తీవ్రమైన గుండెపోటుతో ఆసుపత్రికి వచ్చిన 67 ఏళ్ల రోగికి అత్యంత క్లిష్టమైన గుండె రక్తనాళాల సమస్యను అత్యాధునిక స్టెంటింగ్ విధానంతో విజయవంతంగా చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు కిమ్స్ సవీర వైద్యులు. ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు చికిత్సనందించిన కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డా. స్పందన. అనంతపురం జిల్లాకు చెందిన దూదేకుల దస్తగిరి (67) తీవ్రమైన గుండెపోటు లక్షణాలతో ఆసుపత్రిలో చేరారు. ఇక్కడ చేసిన కరోనరీ యాంజియోగ్రామ్ లో గుండె ప్రధాన రక్తనాళమైన లెఫ్ట్ మెయిన్ కరోనరీ ఆర్టరీతో పాటు మూడు ప్రధాన గుండె రక్తనాళాల్లో తీవ్ర అడ్డంకులు (ట్రిపుల్ వెసెల్ డిసీజ్) ఉన్నట్లు గుర్తించాం. దీంతో రోగికి కరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్ట్ (సీఏబిజి) శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించాం. కాగా వ్యక్తిగత కారణాలతో రోగి శస్త్రచికిత్సకు అంగీకరించకపోవడంతో, ప్రత్యామ్నాయంగా అత్యాధునిక ఆప్టికల్ కోహెరెన్స్ టోమోగ్రఫీ (ఓసిటి) మార్గదర్శకత్వంలో లెఫ్ట్ మెయిన్ బైఫర్కేషన్ స్టెంటింగ్ వేశాం. అత్యంత క్లిష్టమైన ఈ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ ప్రక్రియ విజయవంతంగా చేశాం. చికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ప్రస్తుతం ఫాలోఅప్‌లో రోగి ఆరోగ్యంగా ఉన్నారు. అంతేకాకుండా తన దైనందినత పనులను తనే స్వయంగా చేసుకోగలుగుతున్నారు. గుండె ప్రధాన రక్తనాళంలో ఏర్పడే అడ్డంకులు అత్యంత ప్రమాదకరమైనవని, అయితే ఆధునిక ఇమేజింగ్ సాంకేతికతలైన ఓసిటి సహాయంతో క్లిష్టమైన స్టెంటింగ్ విధానాలను మరింత ఖచ్చితత్వంతో, సురక్షితంగా నిర్వహించవచ్చన్నారు. గుండెపోటు లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా ప్రాణాపాయ పరిస్థితులను నివారించవచ్చని సూచించారు. విజయవంతంగా చికిత్స అందించిన వైద్య బృందానికి రోగి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలుపుతూ అభినందనలు తెలిపారు.

## చిరుధాన్యాల చిక్కీలతో విద్యార్థుల ఆరోగ్యానికి భరోసా

### పాఠశాలల్లో మిల్లెట్ చిక్కీల ప్రవేశంపై బీజేపీ కిసాన్ మోర్చా హర్షం



పుట్టపర్తి : విద్యార్థుల ఆరోగ్యకరమైన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో అందించే చిక్కీలలో చిరుధాన్యాల (మిల్లెట్స్) ఆధారిత చిక్కీలను ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చింతా శరత్ కుమార్ రెడ్డి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పోషకాహారాన్ని అందించేందుకు పాఠశాలల్లో చిరుధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహించాలని కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గతంలో అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రుల సహకారంతో సంతకాల సేకరణ చేపట్టి, పోస్టు కార్డుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం, మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించినట్లు పేర్కొన్నారు. చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, విద్యార్థుల్లో పోషకాహార లోపాలను తగ్గించడంతో పాటు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని చింతా శరత్ కుమార్ రెడ్డి అన్నారు. పాఠశాలల్లో చిరుధాన్యాల ఆధారిత చిక్కీలను ప్రవేశపెట్టడం విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో ఒక కీలకమైన ముందడుగు అని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజన పథకంలో వారానికి కనీసం ఒకరోజు చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. దీని ద్వారా విద్యార్థుల్లో చిరుధాన్యాలపై అవగాహన పెరగడంతో పాటు ఆరోగ్యవంతమైన జీవనశైలిపై ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ చిరుధాన్యాల చిక్కీలను ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి, విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్‌కు చింతా శరత్ కుమార్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక సర్వే



పుట్టపర్తి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర (స స) కార్యక్రమంలో భాగంగా పుట్టపర్తి పురపాలక సంఘం పరిధిలో బల్క్ వ్యర్థ ఉత్పత్తిదారుల గుర్తింపు, నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జూలై నెల ప్రత్యేక థీమ్‌గా బల్క్ వ్యర్థ ఉత్పత్తిదారుల గుర్తింపును చేపట్టారు. ఇందులో భాగంగా హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, వాణిజ్య సంస్థలు, ఇతర అర్హత కలిగిన సంస్థలను గుర్తించి, ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల ప్రకారం నమోదు చేసేందుకు ప్రత్యేక సర్వే నిర్వహించారు. బల్క్ వ్యర్థ ఉత్పత్తిదారులు తమ సంస్థల్లోనే వ్యర్థాలను మూలస్థాయిలో వేరు చేయడం, తడి వ్యర్థాలను స్థానికంగా శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం, పొడి వ్యర్థాలను రీసైక్లింగ్‌కు అందించడం వంటి చర్యలను తప్పనిసరిగా చేపట్టాలని అధికారులు సూచించారు. అలాగే నిబంధనల ప్రకారం సంబంధిత పోర్టల్‌లో నమోదు చేసుకొని వ్యర్థాల నిర్వహణ నిబంధనలను పాటించాల్సి ఉంటుందని తెలిపారు. పరిశుభ్రమైన, హరిత మరియు సుస్థిర పుట్టపర్తి నిర్మాణానికి ప్రతి సంస్థ, ప్రతి పౌరుడు భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. "వ్యర్థాలను బాధ్యతగా నిర్వహిద్దాం పుట్టపర్తిని స్వచ్ఛంగా నిర్మిద్దాం" అనే సందేశంతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

## కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసిన అధికారులు



పుట్టపర్తి : పుట్టపర్తి మండల పరిధిలోని జగరాజుపల్లి కేజీబీవీ పాఠశాలను మండల ప్రత్యేక అధికారి నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవో శంకర్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల వసతిగృహము, భోజనశాల, పాఠశాల సిబ్బందిని, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో భోజన వసతులను, నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారము అందజేయాలని, వారికి అందించే కాస్మెటిక్స్, మరియు ఇతర వస్తువులను సక్రమంగా అందించాలని, సూచించారు. ఎలాంటి లోపాలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా వారితోపాటు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పంటల భీమా ప్రీమియం చెల్లింపు తేదీని ఆగస్టు 15 కి పొడిగించండి

### ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్




పత్తికొండ :: పత్తి, వేరుశనగ, టమాటా తో పాటు అన్ని పంటలకు రైతుల పంట భీమా ప్రీమియం చెల్లింపు ఆఖరి తేదీని ఆగస్టు 15 కి పొడిగించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు రైతులు డిమాండ్ చేశారు. అన్ని పంటలతోపాటు పత్తి, వేరుశనగ, టమాటా రైతుల పంట భీమా ప్రీమియం చెల్లింపు ఆఖరి తేదీని ఆగస్టు 15కి పొడిగించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి రాజా సాహెబ్ తో పాటు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి బి సురేంద్ర కుమార్ రైతు సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షులు ఎం కారన్న సిపిఐ మండల కార్యదర్శి కారుమంచి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమితి వరకు నియోజవర్గ ప్రతినిధి బృందం కలిసి శనివారం పత్తికొండ తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్ గారికి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గారితో మాట్లాడుతూ రైతులు అంతర్జామా ప్రీమియం చెల్లింపు వ్యవసాయం సమయం చాలా తక్కువగా ఉండడంవల్ల రైతులు మీసేవ కేంద్రాల్లో అనేకచోట్ల తీవ్రమైన ఇబ్బందులకు గురి అవుతున్నారని చాలామందికి విషయం కూడా తెలియని పరిస్థితి ఉందని అందువల్ల అన్ని పంటలతో పాటు పత్తి వేరుశనగ టమాట మిరప జున్న కొజ్జ కోర్ర అందము కంది మొక్కజొన్న వరి పండించిన రైతుల పంట బీమా సమయాన్ని ఆగస్టు 15 వరకు అన్ని పంటలను పడవు పొడిగించాలని వారు తహసీల్దార్ గారి దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ విషయాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని వారు కోరారు. ఈ సందర్భంగా డి. రాజా సాహెబ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ రబీ సీజన్లో రైతులు పండిస్తున్న పంటలకు బీమా కల్పించేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమా పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లు ప్రకటన చేసిందని ప్రధానమంత్రి ఫసల్ బీమా ప్రీమియం చెల్లింపు జులై 31 వరకు ఇచ్చారు. కానీ వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో పత్తి వేరుశనగ టమోటా పంటలకు బీమా ప్రీమియం రైతుల వాటా చెల్లించేందుకు 2026 జూలై 15 కు ఆఖరు తేదీగా ప్రకటించడంవల్ల రైతుల్లో తీవ్రమైన ఆందోళనలో ఉన్నదని తిరిగి ఈ పంటలకు జూలై 31 వరకు బ్యాంకులో చెల్లించాలని ఆయన తెలిపారు. ఎలినో ప్రభావంతో వర్షాలు లేక పంటలన్నీ దెబ్బతినడంతో రైతులు తీవ్రమైన ఆవేదనతో ఉన్నారని ఇలాంటి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన భీమ కొంతవరకైనా కలుగుతుందని ఆశించిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన తేదీలు ఆందోళనకు గురిచేశాయని ఆయన తెలిపాడు. రాయలసీమ జిల్లాలలో కర్నూలు, జిల్లాలలో పత్తి, వేరుశనగ, టమోటా విస్తారంగా సాగు చేస్తారని, టమోటా పంటకు కర్నూలు జిల్లాలో ప్రీమియం జాబితాలో లేదని టమోటా పంటను కూడా ప్రీమియం జాబితాలో చేర్చాలని పంటల తో పాటు అన్ని పంటలకు ప్రభుత్వ ఆఖరు తేదీని 2026 ఆగస్టు 15 వరకు గడువు పొడిగించాలని ఆయన డిమాండ్ చేశారు.కర్నూలు జిల్లాలో ప్రభుత్వ అంచనాల ప్రకారమే రైతులు ఇప్పటికే సుమారుగా 4.00 లక్షల ఎకరాలు పత్తి సాగు చేశారు. పత్తికి ఎకరాకు రూ. 2,000/- లు రైతు వాటాగా పంటల బీమా ప్రీమియం నిర్ణయించారు, ఒక్కొక్క రైతు 5 నుండి 10 ఎకరాలు వరకు సాగు చేస్తున్నారని, నిత్యం కరువు ప్రాంతంగా ఉండే కర్నూలు జిల్లాలలో ఇంత పెద్ద మొత్తం పంటల బీమా ప్రీమియం గా చెల్లించడం రైతులకు భారం అవుతుంది. కనుక పంటలబీమా ప్రీమియం పత్తికి ఎకరాకు 500 రూపాయలకు మించకుండా నిర్ణయించాలని,బీమా ప్రీమియం చెల్లించేందుకు గడువును ఆగస్టు 15 వరకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళితులకు పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ గురుదాస్ రైతు సంఘం నాయకులు రాజప్ప రవికుమార్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస్ నాయక్



పుట్టపర్తి: మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ఆర్సిపి ఎస్ టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస్ నాయక్ ను నియమించారు. పుట్టపర్తి మండల ప రిదిలో నీ పెడపల్లి తాండ కు చెందిన ఎం శ్రీనివాస్ నాయక్, గత కొంత కాలంగా వై ఎస్ ఆర్ సి పి కీ చేసిన సేవకు గుర్తింపుగా ఆయన్ను నియమించినట్లు, వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యాలయం నుండి ఆదేశాల అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ని పుట్టపర్తి లోని కార్యాలయంలో శనివారం కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తన ఎంపికకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి నాకు ఈ పదవిని అప్పజెప్పిన బాధ్యతలను నిర్వర్తిస్తానని, శక్తివంచన లేకుండా అహర్నిశలు పార్టీ ప్రతిష్ట కోసం, కార్యకర్తలను కలుపుకొని, పని చేస్తానని, గిరిజన ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. నా ఎంపికకు కృషిచేసిన పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుగుంట శ్రీధర్ రెడ్డికి, జిల్లా అధ్యక్షురాలు ఉషా శ్రీ చరణ్ కు, వైయస్సార్సీపి రాష్ట్ర, జిల్లా నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలు వురు, వై ఎస్ ఆర్ సి పి నాయకులు, గిరిజన సంగ నాయకులు, ఆయన కు శుభాకాంక్షలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

### పార్థివదేహాలకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

### బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ





పుట్టపర్తి : పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంతి గ్రామానికి చెందిన శ్రీ నరేంద్ర బాబు (40), శ్రీమతి ఓం లత (35) దంపతులు పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన విషాదకర రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందారు. ఈ విషాద ఘటన విషయం తెలుసుకున్న పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి శనివారం వారి నివాసానికి వెళ్లి, దంపతుల పార్థివ దేహాలకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, ముఖ్యంగా తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు చిన్నారులను ఓదార్చారు. "మీకు అన్ని విధాలా అండగా ఉంటాను. ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయం అందేలా చూస్తాను" అని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్సార్సీపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో "స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర"




పుట్టపర్తి : శ్రీ సత్యసాయి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు శనివారం జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో "స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో స్వచ్ఛత, పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ నిరంతరం పరిశుభ్రతను పాటిస్తూ, భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన ఆంధ్రాను అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ డిప్యూటీ డెమో సుబ్రహ్మణ్యం, డిప్యూటీ రామలక్ష్మి, సిహెచ్ వోలు వన్నప్ప, గఫూర్ (ఎంపీ ఈ హెచ్ ఓ లక్ష్మినాయక్ (ఇంచార్జ్ ఏ ఎం ఓ), ఆఫీస్ సూపరింటెండెంట్ ఫిరోజ్, నాగభూషణం, డి పీ ఓ నాగరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించిన మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి





పుట్టపర్తి: పుట్టపర్తి ప్రశాంతి గ్రామ్ లో నివాసం ఉన్న నరేంద్రబాబు ఓం లత లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఈ సమాచారాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ రఘునాథరెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడి ఇటీవల మృతి చెందారు. శోకసంద్రంలో ఉన్న ఆ కుటుంబాన్ని శనివారం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో నరేంద్రబాబు, ఓం లత మృతి అత్యంత బాధాకరమని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని విధాలుగా ఆ కుటుంబానికి అండగా ఉంటామని వారి మృతి ఆ కుటుంబానికి తీరని లోటని ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి భరోసా ఇచ్చి కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి చెందిన కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్ అవార్డుకు వశిష్ట స్కూల్ విద్యార్థులు ఎంపిక

ఓ డి చెరువు మండల కేంద్రంలోని స్థానిక వశిష్ఠ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రభుత్వ ప్రతిష్టాత్మక షైనింగ్ స్టార్ అవార్డుకు ఎన్నికైనట్లు కరెస్పాండెంట్ పిట్టా శివ శంకర రెడ్డి తెలిపారు. 2025- 26 విద్యా సంవత్సరానికి జరిగిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో వశిష్ట పాఠశాలకు చెందిన లింగాల నిఖిల, ఎం చేతన్ అను విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతో షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికయ్యారని అన్నారు. ఈనెల 20న పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద మహి గార్డెన్ లో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డుతో పాటు పారితోషికంగా 20 వేల రూపాయల నగదును అందుకోనున్నట్లు కరెస్పాండెంట్ శివశంకర్ రెడ్డి తెలిపారు. శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు ఈ అవార్డుకు ఎంపికవడం ప్రతిభకు నిదర్శనమని, విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత విద్యలో రాణించి మరిన్ని అవార్డులు, రివార్డులు సాధించడంతో పాటు దేశం గర్వించేస్థాయికి ఎదగాలని ఆశీర్వాదించారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ పిట్టా పార్థసారథి రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.


## ఆశ్రమ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

### ఐటీడీఏ పీవోకు తుడుందెబ్బ నాయకుల వినతి




ఆసిఫాబాద్ : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా తుడుందెబ్బ నాయకుల బృందంతో కలిసి ఐటీడీఏ పీవో మంద మకరందును కలిసి, జిల్లాలోని పలు ఆదివాసీ గ్రామాల సమస్యలు, పాఠశాలల దుస్థితిపై వినతిపత్రం సమర్పించి సుదీర్ఘంగా చర్చించారు.ఏజెన్సీ ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా కనీస మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తుడుందెబ్బ నాయకులు తెలిపారు. ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలల్లోని సమస్యలను వివరిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని కోరారు. హాస్టళ్లు, పాఠశాలల్లో తాగునీరు, పరిశుభ్రత వంటి కనీస వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన విద్యార్థుల్లోని నైపుణ్యాలు, ప్రతిభను గుర్తించి ప్రభుత్వపరంగా ప్రోత్సహించాలని కోరారు. విద్యా రంగంతో పాటు ఆదివాసీలు ఎదుర్కొంటున్న ఇతర సామాజిక, ప్రాంతీయ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని పీవోను కోరారు. దీనిపై సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా సలహాదారు కనక ప్రభాకర్, టైగర్ సేనా జిల్లా ప్రధాన కార్యదర్శి మడవి పురుషోత్తం, సోనాపూర్ సర్పంచ్ & తుడుందెబ్బ వాంకిడి మండల ప్రధాన కార్యదర్శి పంద్రం పసురేష్, తుడుందేబ్బ వాంకిడి మండల ఉపాధ్యక్షులు సోయం సంజీవ్, దుబ్బగూడ సర్పంచ్ కోవ మోతిరాం, తుడుందేబ్బ కేరామెరి మండల కార్యదర్శి అడ చిన్నూ, ప్రముఖ నాయకులు అడ సోమేష్, మడవి జ్యోతిరాం, కోవ శ్యాంరావు, ఆత్రం మారుతీ తదితరులు పాల్గొన్నారు.

## అడుక్కో కాలనీలో గుడి షెడ్ నిర్మాణానికి వినతి



ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ నియోజకవర్గం అడుక్కో కాలనీలో దేవాలయానికి గుడి షెడ్ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు, దేవాలయ కమిటీ సభ్యులు కోరారు. వీరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ అజ్మీరా శ్యామ్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.దేవాలయానికి వచ్చే భక్తులు ఎండ, వర్షాల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, శాశ్వత గుడి షెడ్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. దీనిపై అజ్మీరా శ్యామ్ నాయక్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి, గుడి షెడ్ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మంగ, ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815